సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 26 । జూలై । 2024





**మూగ జీవాలకు రక్షణేది?**

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

- IIIలో ▸



**బర్త్‌డే పార్టీకి వెళ్లొచ్చేసరికి..**

బంధువు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వెళ్లివచ్చేలోగా నిజామాబాద్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది.

- IIలో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
28.2 /22.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### 'అంకితభావంతో విధులు నిర్వహించాలి'



**కామారెడ్డి రూరల్:** ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చేందుకు డ్రైవర్లు, కండక్టర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్టీసీ నిజామాబాద్ ప్రాంతీయ అధికారి జానీరెడ్డి సూచించారు. గురువారం కామారెడ్డి ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జానీరెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు నడపాలన్నారు. వారోత్సవాలలో భాగంగా డిపో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినవారికి బహుమతులు అందించారు. ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ అధికారి సరస్వతి, జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిపో మేనేజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

### 'భవిష్యత్ తరాలకు నిఘంటువుగా నిలుస్తుంది'

**కామారెడ్డి అర్బన్:** జగద్గురువు ఆది శంకరాచార్యులు రాసిన సౌందర్యలహరిపై డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ రాసిన 'సౌందర్య లహరి సౌందర్యం' పరిశోధన గ్రంథం వర్తమాన, భవిష్యత్తు తరాలకు గొప్ప నిఘంటువుగా ఉంటుందని డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. కామారెడ్డికి చెందిన అష్టావధాని అయాచితం నటేశ్వరశర్మ పరిశోధన గంథ్రం 'సౌందర్య లహరి సౌందర్యం' పుస్తకాన్ని గురువారం ఓ చానల్‌లో ఆవిష్కరించారు. రచయత నటేశ్వరశర్మ అనారోగ్య కారణాలతో ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఆవిష్కరణ సభలో మహా సహస్రావధాని గరికపాటి నర్సింహారావుతోపాటు ఆధ్యాత్మికవేత్తలు పద్మాకర్, అనంతలక్ష్మి, దూళిపాళ మహాదేవమణి, శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, పురాణం మహేశ్వరశర్మ, దత్తాత్రేయ శర్మ, రామశర్మ తదితరులు పాల్గొన్నారు. రచయిత నటేశ్వరశర్మ తన పరిశోధన గ్రంథంలో కొండను తవ్వి మణులు, మాణిక్యాలు వెలికితీశారని వక్తలు పేర్కొన్నారు.

### ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా హీరాలాల్



**కామారెడ్డి అర్బన్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా కామారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ హీరాలాల్ నియమితులయ్యారు. గురువారం జిల్లా యోగాభవన్‌లో ఎస్‌జీఎఫ్ సమావేశం నిర్వహించారు. పీఈటీల ఏకాభిప్రాయంతో హీరాలాల్‌ను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తున్నట్లు డీఈవో రాజు తెలిపారు. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి రసూల్, పీఈటీ అసోసియేషన్ల ప్రతినిధులు వెంకటేశ్వరగౌడ్, స్వామిగౌడ్, మధుసూదన్‌రెడ్డి, సాయిమౌర్య అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్



**బాన్సువాడ రూరల్:** బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్)కు ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్ట్ ఆర్గనైజేషన్(ఐఎస్‌వో) సర్టిఫికెట్ దక్కింది. గురువారం ఐఎస్‌వో మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య కళాశాలను సందర్శించారు. కళాశాల గ్రీన్ ఆడిట్ రిపోర్టు, ఎనర్జీ, ఐక్యాక్ రిపోర్టులను పరిశీలించారు. కళాశాల ఆవరణ, తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇందూరు గంగాధర్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గులాం ముస్తఫా, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, శంకర్‌రావు, అంబయ్య, బాలరాజు, వినయ్, చిరంజీవి, కృష్ణ, అనిత, పద్మ, రాజేష్, పురుషోత్తం, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి ప్రాధాన్యత!



శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. వ్యవసాయ, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించడాన్ని ఆయా వర్గాలు స్వాగతిస్తున్నాయి. కాగా ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీల అమలు ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

- ఇందిరమ్మ ఇళ్లకు కేటాయింపులు
- వ్యవసాయానికీ బడ్జెట్‌లో భారీగా నిధులు
- సన్న వడ్లకు బోనస్‌పై అన్నదాతల్లో హర్షం

**కామారెడ్డి క్రైం:** రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది. అయితే గత ప్రభుత్వంలో సంక్షేమ శాఖలకు ప్రతి బడ్జెట్‌లోను కేటాయింపులు జరిగినప్పటికీ నిధులను అరకొరగానే ఖర్చు చేశారన్న విమర్శలున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలకు రూ.53 వేల కోట్ల వరకు నిధులు కేటాయించారు. దీంతో ఆయా శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందుతాయని ఆయా వర్గాల నిరుద్యోగులు, ప్రజలు ఆశిస్తున్నారు.

**వ్యవసాయ రంగానికి..**

పంట రుణాల మాఫీకి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కాగా ఇప్పటికే రుణమాఫీ అమలు ప్రక్రియ ప్రారంభమయ్యింది. జిల్లాలో 3.16 లక్షల మంది రైతులుండగా.. తొలి విడతలో రూ. లక్షలోపు పంట రుణం ఉన్న సుమారు 50 వేల మందికి లబ్ధి చేకూరింది. మిగతా రెండు విడతల్లో ఎంతమందికి లబ్ధి చేకూరుతుందన్న దానిపై స్పష్టత లేదు. రైతు కూలీలకు ఏటా రూ. 12 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. జిల్లాలో 1.50 లక్షల మంది వరకు రైతు కూలీలు ఉన్నారని అంచనా. ప్రభుత్వ నిర్ణయంతో వారందరికీ లబ్ధి చేకూరనుంది. బడ్జెట్‌లో ఫసల్ బీమానూ ప్రస్తావించారు.

### 14 వేల ఇందిరమ్మ ఇళ్లు..

బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మించనున్నట్లు ప్రకటించారు. దీంతో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 14 వేల కుటుంబాల సొంతింటి కల నేరవేరే అవకాశాలున్నాయి. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 చొప్పున అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దీని గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడంతో మహిళలు నిరాశ చెందుతున్నారు. ఆసరా పెన్షన్ పెంపుపైనా ప్రకటన లేకపోవడంతో పెన్షన్‌దారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### సంక్షేమానికి భారీగా నిధులు..



నేను సలహాదారుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖలకు తగిన ప్రాధాన్యత లభించింది. ఆయా శాఖలకు కలిపి భారీగా నిధులు కేటాయించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్ద పీట వేశారు. నీటి పారుదల శాఖకు రూ. 22,301 కోట్లు కేటాయించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీల అమలు కోసం రూ.50 వేల కోట్లు కేటాయించారు.

– షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారు

### అనుకూలమైన బడ్జెట్



ఇది అన్ని వర్గాలకు అనుకూలమైన బడ్జెట్. సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. నీటిపారుదలశాఖ, విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖలకూ పెద్ద పీట వేశారు. జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించి లెండి ప్రాజెక్టు పూర్తి, కౌలాస్ కోట పునరుద్ధరణ, రోడ్లు, పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. నాగమడుగు ఎత్తిపోతల పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టనున్నారు.

– లక్ష్మీకాంతారావు, జుక్కల్ ఎమ్మెల్యే

### సమన్వయం చేశారు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ అన్నిరంగాలను సమన్వయం చేస్తూ అభివృద్ధికి పెద్ద పీట వేసింది. రైతులు, కార్మికులు, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది. పట్టణాలతోపాటు పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. బడ్జెట్ బాగుంది.

– గడ్డం ఇందుప్రియ,
మున్సిపల్ చైర్‌పర్సన్, కామారెడ్డి

### విద్యకు అరకొరగా నిధులు..



గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం విద్యాశాఖకు మొండి చెయ్యి చూపింది. విద్యా రంగంలో వినూత్న మార్పులు అన్నప్పటికి నిధుల కేటాయింపుల్లో ఏమిలేదు. దీనిని విద్యను క్రమక్రమంగా ప్రయివేట్ రంగానికి వదిలివేసే కుట్రగా భావించాల్సి వస్తుంది.

– వేణుగోపాల్,
పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

### ఖర్చు చేస్తేనే ప్రయోజనం



గత పదేళ్లలో సంక్షేమ రంగాలకు కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వెచ్చించలేదు. ఈసారైనా కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలి. ఇళ్ల నిర్మాణానికి రూ. 8,424 కోట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్రంలో లక్షలమంది ఇళ్లులేని పేదలుండగా ఈ నిధులు ఏ మూలకు సరిపోతాయి.

– వెంకట్ గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

### మాటలకే పరిమితం..



విద్యారంగంపై మాటలు తప్ప చేతల్లో ఏమీ లేదని బడ్జెట్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యకు బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు 7.31 శాతమే కేటాయించారు. ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు ఈ కేటాయింపులు ఎలా సరిపోతాయి. గత ప్రభుత్వ విధానాన్నే ఈ ప్రభుత్వం కొనసాగిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

– అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, టీపీటీఎఫ్

## 'రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం'



జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

**కామారెడ్డి రూరల్:** రాష్ట్ర బడ్జెట్‌లో కామారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం, గ్యారంటీ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో కామారెడ్డి జిల్లాకు ఇచ్చింది గాడిద గుడ్డు అన్నారు. జిల్లాకు సాగు నీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాణహిత –చేవెళ్ల పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో కనీసం కామారెడ్డి పేరు ప్రస్తావించలేదన్నారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెక్యులర్ ప్రభుత్వం అని చెప్పుకుంటూ ముస్లిం సంస్థకు రూ. 2.4 కోట్లు నిధులు కేటాయించడం ఏమిటని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, నాయకులు వేణు, రాజలింగం, గోవర్దన్, ప్రవీణ్, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంసాగర్‌లోకి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



పోచారం ప్రాజెక్టు నీటిమట్టం



కౌలాస్ ప్రాజెక్టు నీటిమట్టం



గోజేగావ్ వద్ద వంతెనపై నుంచి పారుతున్న నీరు

**నిజాంసాగర్(జుక్కల్):** మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. గురువారం సాయంత్రానికి 1,388.32 అడుగుల(3.411 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

**కౌలాస్‌లోకి 521 క్యూసెక్కులు..**

మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి 521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 454.70 మీటర్ల(0.580 టీఎంసీ) నీరు నిల్వ ఉందన్నారు.

**పోచారంలోకి 61 క్యూసెక్కులు..**

**నాగిరెడ్డిపేట:** ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా పోచారం ప్రాజెక్టులోకి గురువారం 61 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1.82 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో 0.352 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**మునిగిన లోలెవల్ వంతెన**

**మద్నూర్:** మండలంతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో గురువారం లెండి వాగు ఉప్పొంగింది. మండలంలోని గోజేగావ్ గ్రామ సమీపంలోని లెండి వాగుపైగల లోలెవల్ వంతెనపైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

# ఇంకా లోటు వర్షపాతమే!

- తేలికపాటి వానలతో నిండని చెరువులు, కుంటలు
- జిల్లాలో సాధారణ వర్షపాతం 996.7 మిల్లీ మీటర్లు
- ఇప్పటి వరకు కురిసింది 371.8 మిల్లీ మీటర్లే..



**కామారెడ్డి క్రైం:** జిల్లాలో వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నా.. వాగులు వంకలు పొంగడం లేదు. చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. భారీ వర్షాలు కురియకపోవడంతో ఇప్పటికీ లోటు వర్షపాతమే నమోదయ్యింది.

బంగాళా ఖాతంలో అల్పపీడనం, రుతుపవనాల్లో చురుకైన కదలికల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో సైతం కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిశాయి. కానీ ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జిల్లాకు సంబంధించి ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 996.7 మిల్లీ మీటర్లు కాగా.. గతేడాది ఇదే సమయానికి 479.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈసారి 371.8 మిల్లీ మీటర్ల వర్షపాతమే నమోదయ్యింది.

**జలకళ సంతరించుకోని చెరువులు..**

జిల్లాలో వర్షాలు పడుతున్నా జలాశయాలు జలకళ సంతరించుకోవడం లేదు. రోజంతా ముసురుపట్టి ఉంటున్నా భారీ వర్షాలు లేకపోవడంతో వాగులు, వంకలు పారడం లేదు. దీంతో చెరువులు, కుంటల్లో ఇప్పటికీ సమృద్ధిగా నీళ్లు చేరలేదు. జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలంలో భారీ వర్షాలు కురియగా మద్నూర్, బిచ్కుంద, భిక్కనూరు, బాన్సువాడ, తాడ్వాయి, డోంగ్లి మండలాల పరిధిలో సాధారణం కంటే ఎక్కువ వానలు పడ్డాయి. మిగతా అన్ని మండలాల పరిధిలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యింది. భారీ వర్షాలు పడి వరద నీరు జలాశయాల్లోకి చేరితేనే భూగర్భ జలాలు పెంపొందే అవకాశం ఉంటుంది. కాగా తేలికపాటి వానలు రోజుల తరబడి కురవడం కూడా ఒక రకంగా మంచిదేనని అధికారులు అంటున్నారు. భూమి లోతుగా తడవడంతో జలాశయాలు, చెరువుల్లోకి నీరొచ్చేందుకు వీలుగా వరద కాలువలు శుభ్రం అవుతాయంటున్నారు. తద్వారా భారీ వర్షాలు పడితే వెంటనే వరద నీరు జలాశయాలను చేరుతుందని పేర్కొంటున్నారు. ఈ నెలాఖరుతోపాటు వచ్చే నెలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వరుణుడు కరుణించాలని అన్నదాతలు ప్రార్థిస్తున్నారు.

# లాభాల బాటలో ఆర్టీసీ

- మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన రద్దీ
- బాన్సువాడ డిపోకు పెరిగిన ఆదాయం



**బాన్సువాడ:** నష్టాల బాటలో ప్రయాణిస్తున్న ఆర్టీసీకి మహాలక్ష్మి పథకం వరంలా మారింది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో బాన్సువాడ డిపో లాభాల బాట పట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. బాన్సువాడ ఆర్టీసీ డిపోలో 75 ఆర్టీసీ బస్సులు, 17 అద్దె బస్సులు ఉన్నాయి. 194 మంది కండక్టర్లు, 135 మంది డ్రైవర్లు సేవలందిస్తున్నారు. డిపో పరిధిలోని 40 రూట్‌లలో బస్సులు రోజూ 32 వేల కిలోమీటర్ల మేర తిరుగుతున్నాయి. ప్రతి రోజూ సుమారు 46 వేల మంది ప్రయాణికులు వాటిలో గమ్యస్థానాలకు చేరుతున్నారు. కాగా 2022 –2023 ఆర్థిక సంవత్సరంలో బాన్సువాడ డిపోకు రూ. 1.35 కోట్ల నష్టం వచ్చింది. అయితే అనూహ్యంగా 2023 –2024 ఆర్థిక సంవత్సరంలో డిపో నష్టాలనుంచి బయటపడడమే కాకుండా రూ.87 లక్షల లాభాన్ని ఆర్జించింది. కార్మికుల శ్రమతో పాటు మహాలక్ష్మి పథకంతో డిపో లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది. మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య బాగా పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో సగటున 60 శాతం మంది ప్రయాణికులు ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

**మహాలక్ష్మి పథకంతోనే..**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో గతంలో నష్టాల బాటలో ఉన్న డిపో ప్రస్తుతం లాభాలను ఆర్జిస్తోంది. ఈ ప్రగతిలో కార్మికుల శ్రమ కూడా ఉంది.

– సరితాదేవి, డీఎం, బాన్సువాడ డిపో

## డీఈఈసెట్‌లో జిల్లావాసికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



సుమయా (స్టేట్ ఫస్ట్)



ఉమెమా (8వ ర్యాంక్)

**బాన్సువాడ:** డీఈఈసెట్(ఉర్దూ మీడియం)లో బాన్సువాడకు చెందిన సుమయా స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. బాన్సువాడ పట్టణానికే చెందిన మరో విద్యార్థిని ఉమెమా కౌసర్ డీఈఈసెట్(ఉర్దూ మీడియం)లో రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో ర్యాంకు పొందింది. వీరిద్దరు బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఉర్దూ మీడియం) లో ఇంటర్ విద్యనభ్యసించారు. కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు రావడంపై ప్రిన్సిపాల్ పాండురంగం, అధ్యాపకులు అబ్దుల్ హాఫీజ్, మహ్మద్ ఇక్బాల్, మక్బుల్ అహ్మద్, కళాశాల కమిటీ సభ్యులు ఎజాస్, విఠల్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా

### దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభం

బాన్సువాడ రూరల్: డిగ్రీకళాశాలలో ప్రవేశం కోసం ఇప్పటి వరకు దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకోలేని విద్యార్థుల కోసం స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎస్ఆర్ఎన్కే ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. కళాశాలలో సీటు రాని విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు, మెరుగైన వసతులతో పాటు అటానమస్ హోదా, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

### పెద్ద చెరువు పరిశీలన



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలో అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువును మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజల తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని టేక్రియల్ సమీపంలో గల పెద్ద చెరువును నీటి లభ్యత గురించి చర్చించారు. పట్టణానికి తాగు నీటి అవసరం కోసం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుంచి 30 శాతం మంచినీటి సప్లై కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. తాగు నీటి అవసరం కోసం సత్వర ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీఈ సంతోష్, టీపీవో గిరిధర్, కౌన్సిలర్లు పాత శివకృష్ణమూర్తి, తైబ సుల్తానా సలీం, లడ్డు మొయినుద్దీన్, ఆస్మా అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

### 'గాయత్రి' యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్



కామారెడ్డి రూరల్: బ్యాంకులో రైతుల పాసుబుక్కులపై రైతుల పేరిట బ్యాంకులో రుణాలు తీసుకున్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బ్యాంకు అధికారులు, గాయత్రి ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కై రైతుల పేరిట పంట రుణాలు తీసుకోవటం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన ఫ్యాక్టరీ యజమాన్యం, బ్యాంక్ అధికారులపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని కోరారు. తీసుకున్న రుణాలను రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

### నేడు కామారెడ్డిలో దుర్గమ్మ, ఊరడమ్మ పండగ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంలోని వీక్లి మార్కెట్లో దుర్గమ్మ, ఊరడమ్మ పండుగను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు కామారెడ్డి పట్టణ అభివృద్ధి సదరు సంఘం ప్రతినిధులు గురువారం తెలిపారు. 26న ఉదయం అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పూజా కార్యక్రమాలు, గటం కుండ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



# తెగని పోడు పంచాయితీ

**దాడులతో ముదురుతున్న వివాదం**



నడిమి తండాలో అటవీ అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు(ఫైల్)

మాచారెడ్డి: తాతల నాటి నుంచి పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న తమపై అకారణంగా దాడులు చేస్తూ కేసులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. హక్కు పత్రాల్లో ఉన్నది దున్నకుండా అటవీ ప్రాంతాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేస్తేనే ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు పెడుతున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో అటు అధికారులు ఇటు రైతుల మధ్య వివాదం ముదిరి చిలికి చిలికి గాలి వానల మారుతుంది. జూన్, జూలై నెలలు వస్తున్నాయంటే అధికారులు ఎప్పుడు వచ్చి దాడులు చేస్తారనని బిక్కు బిక్కుమంటూ బతకాల్సి వస్తోందని ఆయా గ్రామాల పోడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఎల్లంపేట, బంజపల్లి, సోమారంపేట, రత్నగిరిపల్లి, గుంటి తండా, నడిమితండా, వెనుక తండా, అక్కాపూర్, రాజఖాన్ పేట గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. అధికారులకు డబ్బులిస్తే పొజిషన్ లేకుంటే నాన్ పొజిషన్ కింద జమకట్టి దాడులు చేస్తూ వేధిస్తున్నారని వ్యవసాయ రైతు కూలీ సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, అటవీ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాక్టర్లను సీజ్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి నిజా నిజాలు తెలుసుకొని పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతున్నారు.

**దాడులు నిలిపివేయాలి**



మండలంలోని ఆయా గ్రామాల పోడు రైతులపై దాడులను వెంటనే నిలిపివేయాలి. అధికారులు లంచాలు ఇచ్చిన వాళ్లకు పొజిషన్, ఇవ్వని వారిని నాన్ పొజిషన్ కింద జమకట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పోడు రైతులకు హక్కు పత్రాలు అందజేయాలి.
– కొత్త నర్సింలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

**హద్దులు మీరుతున్నారు**



పోడు రైతులకు కేటాయించిన భూమిలో వాళ్లు ఏం జేసుకున్నా మాకు అభ్యంతరం లేదు. వాళ్లు హద్దులు దాటి వస్తున్నారు కాబట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల నడిమి తండా ఎదుల్ చెరువు సమీపంలో నాటిన మొక్కలను ధ్వంసం చేసి అటవీ భూమి ఆక్రమణకు పాల్పడ్డారు. దాంతో కేసు నమోదు చేశాం.
– పవన్, అటవీ శాఖ సెక్షన్ అధికారి

# పర్వతారోహణలో మేటి బన్నీ



బన్నీని అభినందిస్తున్న కేంద్ర మంత్రి సంజయ్ సేథ్, ఎన్సీసీ డీజీ గుర్బీర్పాల్ సింగ్

కామారెడ్డి అర్బన్: దేశంలోని లడక్ ప్రాంతంలో 6,250 మీటర్ల ఎత్తయిన కాంగ్ యాట్సే శిఖరాన్ని కామారెడ్డి యువకుడు విస్లావత్ బన్నీ అధిరోహించి అందరితో శభాష్ అనిపించుకున్నాడు. బన్నీ ప్రస్తుతం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఎన్సీసీ విభాగం ద్వారా పట్టుదల, అంకితభావంతో కాంగ్ యాట్సే శిఖిరాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని, కళాశాల బ్యానర్ను బన్నీ రెపరెపలాడించాడు. బన్నీ గతంలో ఆఫ్రికాలోని 5895 మీటర్ల గల కిలిమంజారో శిఖరాన్ని, సిక్కింలో గల 5282 మీటర్ల మౌంట్ ఆల్ను అధిరోహించాడు. భవిష్యత్తులో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు బన్నీ పేర్కొన్నాడు. గత వారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో బన్నీని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంతి సంజయ్ సేథ్, ఎన్సీసీ డీజీ గుర్బీర్పాల్ సింగ్లు అభినందించారు. తన భవిష్యత్తు పర్వతారోహణలకు కార్పొరేట్ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇవ్వాలని బన్నీ కోరుతున్నారు.



త్రివర్ణ పతాకాన్ని చూపుతున్న బన్నీ

## ఎమ్ఎస్ఎన్ ఫ్యాక్టరీ వ్యర్థాలపై ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న మహిపాల్

భిక్కనూరు: మండలంలోని ఎమ్ఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాలపై జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ మహ్మద్ యాసిన్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్రెడ్డిలకు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మర్రి మహిపాల్ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కెమికల్ కంపెనీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయమై ఉద్యమం చేసేందుకు తమకు సహకరించాలని మహిపాల్ వారిని కోరారు. 18 గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట హక్కుల కమిటీ ప్రతినిధులు లక్ష్మీ నర్సయ్యగౌడ్, రామచంద్రరావు పాల్గొన్నారు.

## అమెరికాలో కేటీఆర్ బర్త్డే



ఎల్లారెడ్డి : అమెరికాలో కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ఫోరం సభ్యులు గురువారం ఘణంగా జరుపుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలం లొంకలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ఫోరం సభ్యుడు కిషోర్రెడ్డి ఆధ్వర్యంలో అమెరికాలోని కనెక్ట్ కట్ రాష్ట్రంలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు.

## హత్య కేసులో నిందితులకు రిమాండ్

- పాత కక్షల నేపథ్యంలోనే హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు

కామారెడ్డి క్రైం: సదాశినగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఇటీవల జరిగిన జీర్ల చిన్న మల్లయ్య హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం సదాశివనగర్ పోలీస్ స్టేషన్లో పోలీసులు వివరాలు వెల్లడించారు. మల్లయ్య ఈ నెల 19న మేకలు మేపడానికి వెళ్లి అదృశ్యం కాగా 20న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు నెలల క్రితం మల్లయ్య కుమారుడు ప్రవీణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన దొండాడి సుమన్, జోగు బీరయ్యలు గతంలో కొబ్బరి బొండాలు దొంగతనం చేసిన ఘటనలో ప్రవీణ్ ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడు. దీంతో సుమన్, బీరయ్యలు తరచుగా ప్రవీణ్ను వేధింపులకు గురి చేయడంతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని భావించిన మల్లయ్య పలుసార్లు వారితో వాగ్వాదం చేశాడు. ఈ కారణంగా మల్లయ్యను చంపాలని సుమన్, బీరయ్యలు పథకం వేశారని డీఎస్పీ తెలిపారు. వారికి మల్లయ్యతో కలిసి గొర్రెలు కాసేందుకు వెళ్లే కందూరి పెద్ద సాయిలు సహకరించాడన్నారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులు ముగ్గురిని గుర్తించి గురువారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు. కేసు ఛేదనలో కృషి చేసిన సీఐ, ఎస్సై, సిబ్బందిని అభినందించారు.

## వరద నీటిలో మునిగిన దోతి పాఠశాల



దోతి పాఠశాల చుట్టూ చేరిన వరద నీరు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని దోతిలోని ప్రాథమిక పాఠశాల చుట్టూ వరద నీరు చేరడంతో గురువారం పాఠశాలకు విద్యార్థులు హాజరు కాలేదు. భారీ వర్షంతో పాఠశాల మొత్తం నీటిలో మునిగిపోవడంతో పాఠశాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంత్ తెలిపారు. అలాగే ఉన్న ఒక్క తరగతి గదిలో సైతం వర్షపు నీరు చేరిందని, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థులు రాకపోవడంతో మధ్యాహ్నం ఎంఈవోకు సమాచారం అందించి ఇంటికి వెళ్లిపోయానని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

## అందరి సహకారంతో అభివృద్ధి



పెద్దకొడప్గల్(జుక్కల్) : అందరి సహకారంతో మండల అభివృద్ధి చేసుకుందామని నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో లక్ష్మీకాంత్ రెడ్డి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇన్చార్జి ఎంపీడీవో సుర్యకాంత్ ఏపీవో సుదర్శన్ ఉన్నారు.

## బర్త్డే పార్టీకి వెళ్లొచ్చే సరికి చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఖలీల్వాడి: బర్త్ డే పార్టీ కోసం హైదరాబాద్ వెళ్లొచ్చే సరికి దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీస్స్టేషన్ పరిధిలోని హమాల్వాడీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తన సోదరుడి కుమారుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వారణాసి వేణుకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 23న ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్కు వెళ్లాడు. వేడుకల అనంతరం గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి వస్తుండగానే పక్కింటికి చెందిన గణేశ్ అనే వ్యక్తి ఫోన్ చేసి మీ ఇంటి తాళం పగులగొట్టి ఉందని వేణుకుమార్కు ఫోన్ చేశాడు. ఇంటికి వచ్చి చూసేసరికి రెండు బెడ్ రూములలోని బీరువాలు ధ్వంసమై ఉన్నాయి. దుండగులు సుమారు 80 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ఇంటిని సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## వర్షానికి కూలిన ఇళ్లు



దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పెంకుటిళ్లు కూలాయి. దోమకొండలోని బీబీపేట రోడ్డులో ఉన్న ఖాజాబీకి చెందిన ఇల్లు గురువారం వర్షానికి కూలినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అధికారులు స్పందించి తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూడాలని వారు కోరారు.

దోమకొండలో వర్షానికి కూలిన ఇల్లు

## డ్రైడేను సక్సెస్ చేయాలి



దోమకొండ : మండలంలో శుక్రవారం నిర్వహించే డ్రైడే ఫ్రైడేను వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ సీసీలు, సీఏలు, మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

## ట్రాన్స్కో డీఈపై విజిలెన్స్ విచారణ



బాన్సువాడ: బాన్సువాడ ట్రాన్స్కో డీఈ కామేశ్వర్రావుపై గురువారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ట్రాన్స్కో కాంట్రాక్టు పనుల అప్పగింతపై డీఈ పక్షపాతం వహిస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారికే కాంట్రాక్టు పనులను ఇస్తున్నారని ఆరోపిస్తూ ఓ లైసెన్స్ కాంట్రాక్టర్ సీఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో ట్రాన్స్కో సీఎండీ ఆదేశాల మేరకు ట్రాన్స్కో విజిలెన్స్ అధికారి రాజ్భరత్రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ డివిజన్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మూడు రోజుల పాటు విచారణ కొనసాగుతుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. డీఈపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు.

## అధికారుల సంరక్షణలో బాలుడు



కామారెడ్డి క్రైం: తప్పిపోయిన దివ్యాంగ బాలుడిని కామారెడ్డి ఐసీడీఎస్ అధికారులు చేరదీసి బాలల పరిరక్షణ విభాగంలో ఉంచారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ బావయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న కామారెడ్డి కొత్త బస్టాండ్ ఆవరణలో బాలుడు ఒంటరిగా ఉండగా, స్థానికులు గమనించి 1098 చైల్డ్ హెల్ప్లైన్కు సమాచారం ఇచ్చారని, అధికారులు అక్కడికి చేరుకుని విచారించగా బాలుడికి మూగ, చెవుడు ఉన్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. అతడు మాట్లాడలేకపోవడంతో వివేకానంద కాలనీలోని బాలల పరిరక్షణ విభాగానికి తరలించారని, బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పూర్తి ఆధారాలతో వచ్చి సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అవగాహన



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై కళా బృందం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా గురించి తెలియజేశారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు షీటీం నెంబర్ 8712686094కు కాల్ చేయాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై 1930కి కాల్ చేయాలని సూచించారు. కళా బృందం సభ్యులు ప్రభాకర్, శేషారావ్, సాయిలు, దోమకొండ ఇన్చార్జి ఎస్హెచ్వో సుబ్రహ్మణ్యచారి తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో బెదిరించి..



వివరాలు తెలుసుకుంటున్న సీఐ మల్లేశ్

జక్రాన్పల్లి: మహిళను దుండగులు కత్తితో బెదిరించి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని నారాయణ్పేట్లో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జానకంపేట్ లక్ష్మి అనే మహిళ భర్త దుబాయిలో ఉంటుండగా, కుమారుడు గ్రామంలో మరోచోట నివాసం ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లక్ష్మి బుధవారం రాత్రి నిద్రిస్తుండగా, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి 'మీ మరిది మరణించాడు.. తలుపులు తీయు' అంటూ పిలిచారు. లక్ష్మి తలుపులు తీసిన వెంటనే సదరు వ్యక్తుల్లు కత్తితో బెదిరించి బీరువాలోని రెండు తులాల పుస్తెలతాడు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. డిచ్పల్లి సీఐ మల్లేశ్ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కరెంట్ షాక్తో మహిళ మృతి

- కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లకు తగిలిన గొడుగు
- మఠంరాళ్ల తండాలో విషాదం



ప్రమీల మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మృతురాలు (ఫైల్)

మాచారెడ్డి: వర్షం కారణంగా విద్యుత్స్తంభం వంగి కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లకు గొడుగు తగిలిన ఘటనలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మఠంరాళ్ల తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన రమావత్ ప్రమీల(28)కు అదే తండాకు చెందిన రవితో వివాహమై ఓ కుమారుడు పుట్టిన తర్వాత విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న ప్రమీల కొంత వ్యవసాయభూమిని కౌలుకు తీసుకొని జీవిస్తోంది. రోజులాగే గురువారం సద్ది గంప ఎత్తుకొని గొడుగు పట్టుకొని వెళ్తుండగా కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్వైర్లు గొడుగు తగిలి ప్రమీలకు షాక్ కొట్టింది. ఈ ఘటనలో ప్రమీల అక్కడికక్కడే మృతి చెందింది. అందరితో కలివిడిగా ఉండే ప్రమీల మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



**క్రైం కార్నర్**

## తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- ఒకే దూలానికి ఉరేసుకొని..
- డోంగ్లీ మండల కేంద్రంలో కలకలం
- భర్త హత్య కేసులో నెల రోజుల క్రితం జైలు నుంచి బయటికి వచ్చిన మృతురాలు



మాలన్బాయి ఇంటి వద్ద విచారిస్తున్న పోలీసులు

మద్నూర్(జుక్కల్): తల్లీకూతుళ్ల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన డోంగ్లీ మండల కేంద్రంలో కలకలంరేపింది. ఇన్చార్జి ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శీతపులే మాలన్బాయి(46)కి కూతురు మనీష(23), కొడుకు మంగళదీప్ ఉన్నారు. గత కొంత కాలంగా మాలన్బాయి అనారోగ్యంతో బాధపడుతుండగా, మనీషకు మతిస్థిమితం లేదు. పదో తరగతి చదువుతున్న మంగళదీప్ గురువారం ఉదయం గ్రామంలోని పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తన తల్లితోపాటు అక్క ఉరేసుకొని ఉండడాన్ని గమనించి స్థానికులకు తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

**మూడు నెలల క్రితం భర్తను హత్య చేసి..**

తనతో నిత్యం గొడవ పడుతున్నాడని మాలన్బాయి తన భర్త మష్ణాజీని మూడు నెలల క్రితం తన మేనల్లుళ్లతో కలిసి హత్య చేసింది. ఈ కేసులో నెల రోజుల క్రితమే జైలు నుంచి బయటికి వచ్చింది. ఇప్పుడు కూతురితో కలిసి ఆత్మహత్య చేసుకోవడంతో కొడుకు మంగళదీప్ అనాథ అయ్యాడు.

## కుక్కర్ విషయంలో గొడవ

- మహిళపై హత్యాయత్నం కేసు నమోదు

నవీపేట: కుక్కర్ విషయంలో ఇద్దరు మహిళల మధ్య ఘర్షణం జరిగింది. ఈ ఘటన నవీపేట పోలీస్స్టేషన్ పరిధిలోని జలాల్పూర్లో చోటు చేసుకోగా, ఓ మహిళపై హత్యాయత్నం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఈర్నాల సావిత్రి అదే గ్రామానికి చెందిన గైనిశెట్టి గంగవ్వ వద్ద నెల రోజుల క్రితం కుక్కర్ను కొనుగోలు చేసింది. అది తరచూ రిపేర్ అవుతుండడంతో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఇటీవల నిజామాబాద్లో రిపేర్ చేయించినప్పటికీ పని చేయకపోవడంతో గురువారం మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన సావిత్రి కమ్మకత్తిని తీసుకెళ్లి గంగవ్వ తలపై కొట్టింది. తీవ్ర రక్తస్రావం కావడంతో సావిత్రి పారిపోయే ప్రయత్నంలో కిందపడిపోగా స్వల్ప గాయాలయ్యాయి. గంగవ్వ సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు సావిత్రిపై హత్యా యత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

## డ్రంకెన్డ్రైవ్లో ఆరుగురిపై కేసు

- 14 వాహనాలు స్వాధీనం



భిక్కనూరులో స్వాధీనం చేసుకున్న వాహనాలు

భిక్కనూరు: మండల కేంద్రంలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 14 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. అలాగే వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేని 40 మంది వాహనాదారులకు చలానాలు విధించారు.

## భూకబ్జా కేసులో ఒకరి అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్పేటకు చెందిన మహ్మద్ షాహిద్ పాషాను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పాషా ఇతరుల భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి భూకబ్జాలు చేసుకుంటూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆయన చెప్పారు. ఈ క్రమంలో నాగిరెడ్డిపేట పోలీస్స్టేషన్లో ఆయన పలు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు షాహిద్ పాషాను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఆయన చెప్పారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, నాగిరెడ్డిపేట ఎస్సై రాజు ఉన్నారు.